కామెడీ కథ

# కాంతామణి స్వర్గానికి వెళ్ళొచ్చింది

ఆ వార్త ఊరు ఊరంతా గుప్పుమంది.

కొంతమంది ఆ వార్త విని పొట్టచెక్కలయ్యేలా నవ్వుకోసాగారు. ఇంకొందరు పిచ్చిపిచ్చి చూపులు చూస్తూ యిది నిజమా? అంటూ బుర్ర గోక్కోసాగారు.

ఇంత హడావిడి, ఆనందకర వాతావరణం కలగడానికి కారణం కాంతామణి చనిపోవడమే!

కాంతామణి చనిపోయిందట...కాంతామణి పోయారా? పోయిందే....గాయబ్...షీ హాజ్ గాన్....యిలా రకరకాలుగా, వికవికాలుగా కామెంట్లు, గీమెంట్లు చేసుకుంటున్నారు.

కాంతామణి మొగుడైతే, ఆనందం పట్టలేక పగలబడి నవ్వుతున్నాడు.

కాంతామణి చచ్చిపోతే యింతానందమా? అని హాశ్చర్య పోతే...అందుకు ఆన్సర్ రెడీగా ఉంది. చిత్తగించండి.

★★★

కాంతామణి రచయిత్రి.

అలా అని ఆమె అడిగినవారికీ, అడగని వారికీ చెబుతూ ఉంటుంది. అలా అని కనిపించిన వారినందర్నీ నడిరోడ్డు మీద ఆపి కవితలు వినిపించి బెదరగొట్టే టైప్ కాదు. అర్ధరాత్రి మద్దెలదరువులా ఇంటి పక్కల వాళ్లని కథలు వినిపెట్టమని సతాయించే రకమూ కాదు. మంచి మూడ్‌లో ఉన్న మొగుణ్ని కథ వినమని పోరుపెట్టి ఆ జీవుడ్ని భయపెట్టే స్టయిలూ కాదు.

మరేమిటది...? అని తెలుసుకోవాలనుకుంటే...

అబ్బో బోల్డు!

మచ్చుకు కొన్ని తెలుసుకోవలసిందే...

★★★

రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

ఆ మాటకొస్తే ఆ వీధి కూడా నిర్మానుష్యంగా ఉంది. దానిక్కారణం అక్కడ కాంతామణి తచ్చాడటం...ఆ కారణంగా అక్కడ కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది.

ఆ వీధి చివర్లో బస్సాగింది.

బస్సులో నుంచి బలేశ్వర్రావ్ దిగేడు. అతని భుజానికి ఏర్‌బేగ్ వేలాడుతోంది. ఖర్మకాలి ఆ రోజు ఆ బస్సులో దిగేడు.

హుషారుగా ఈలవేస్తూ ''నా జన్మభూమి ఎంతో అందమైనదీ...'' అంటూ వచ్చేస్తున్నాడు.

కాంతామణి హుషారుగా ఈలవేసింది.

అసలు కాంతామణి భయంతోనే ఆ వీధిలోని వారంతా చీకటి పడకముందే తలుపులేసుకుని ఆనక ముసుగేస్తారు. పొరపాటున ఎవ్వరైనా కనిపించారా యింతే సంగతులు. చిత్తగించవలెను. కనిపించిన ప్రతివారిని కథ చెప్పమంటుంది. పొరపాటున ఏ మొగుడుగార్రైనా ఆఫీసు నుంచి ఆలస్యంగా ఇంటికి వస్తే తలుపుతీసేది అతడి భార్యగారు కాదు. కాంతామణి. ఎవరు ఏ రోజు ఆలస్యంగా వస్తారో తెలుసుకుని ఆ యింట్లోకి చనువుగా వెళ్లి ఆ యింటి మొగుడుగారు రాగానే తలుపుతీసి, ''యిప్పుడు చెప్పండి కథ...ఆఫీసు నుంచి ఎందుకాలస్యంగా వచ్చారో...'' అని అడుగుతుంది.

అడగడమే కాదు. ఆ మొగుడుగారు చెప్పే కథని (కట్టుకథని) నోట్ చేసుకుని దాన్ని కథగా రాసుకుంటుంది.

ఇలాంటి కళలు బోల్డు స్టాక్ ఉన్నాయి కాంతామణిలో. టీ కొట్టు నాయర్ దగ్గరికి వెళ్లి ఓ సింగిల్ టీకి ఆర్డరిచ్చి, ఆ సింగిల్ టీని అర గంట పాటు చప్పరిస్తూ ''నాయరూ...నీ దగ్గర అరువుకు టీ తాగేవాళ్ళు చెప్పే కథలు చెప్పరాదూ...'' అంటుంది.

కూరగాయల అబ్బిని, లాండ్రీవాడిని, పాలవాడ్ని పేపర్‌బాయ్‌ని, చివరికి ఆ వీధిలో ఎవరింటికి చుట్టాలు వచ్చినా వాళ్లని...ఇలా ఎవర్నీ వదిలిపెట్టకుండా కథలు చెప్పమని చంపుకుతింటుంది. ఆమె భయానికి ఆ వీధిలోకి జనం రావటం మానేశారు.

టోటల్‌గా కనిపించిన వాళ్లని కథలు చెప్పమని వెంటపడే క్యారెక్టర్ కాంతామణిది.

ఆరోజు బలేశ్వర్రావ్ ఖర్మ కాలింది.

★★★

''హలో...బ్రదరిన్‌లా మిమ్మల్నే...'' కేకేసింది కాంతామణి.

బలేశ్వర్రావ్ ముందు ఉలిక్కిపడి, ఆ తర్వాత సంతోషపడి ''మీ...'' అన్నాడు మరింత హాశ్చర్యంతో.

''అవును...మిమ్మల్నే...హలో...బ్రదర్ అని ఆడపిల్ల అంటే కనీసం ఆరు కిలోమీటర్ల వరకూ పరుగెడ్తారు. అందుకే బ్రదరిన్‌లా అన్నా బ్రదరూ...'' అంది.

షాక్‌తో కిందపడబోయి నిలదొక్కుకున్నాడు కాంతామణి పిలుపుల టాలెంట్ చూసి.

''ఇంతకీ తమ పేరేమిటి? '' అడిగింది కాంతామణి.

''బలేశ్వర్రావ్...''

''అనుకున్నాను'' అంది కాంతామణి యధాలాపంగా.

''ఏంటీ...''

''ఏం లేదు...ప్రస్తుత మీ పరిస్థితికి ఈ పేరు బాగా సూటవుతుందని.''

''నా పరిస్థితికేమైంది?''


''అబ్బే...ఏమీ అవ్వలేదు. అవ్వొచ్చేమోనని...యింతకీ మీరిక్కడ ఎవరింటికి వచ్చారు?''

''కిషోర్ అని మా ఫ్రెండ్ యింటికి...''

''మీరేం చేస్తూంటారు?''

''సరిహద్దులో కాపలా కాస్తూంటాను...సిపాయిని'' అన్నాడు మీసాలమీద

> **''మిస్ట్రీ కథలు పేరుతో ఓ పత్రిక్కి మీరు చెప్పిన కథ పంపిస్తాను. అన్నట్టు నా పేరు కాంతామణి. రచయిత్రిని...అఫ్‌కోర్స్ యింకా నా కథలు పత్రికల్లో పడలేదు, రేపో, మాపో పడతాయి...'' అంది ఉత్సాహంగా. ''అలాగా...'' అన్నాడు బిక్కచచ్చి. అప్పటికి ఎలాగో అక్కడ్నుంచి తప్పుకున్నాడు.**



చేయేసుకుని గర్వంగా!

''అంటే మంచి దేశభక్తులన్నమాట...''

''అవునవును...'' అన్నాడు గర్వంగా...తన బ్యాగులో ఉన్న రివాల్వర్‌ని చూసుకుంటూ. దానికి లైసెన్స్ కూడా ఉందాయె మరి!

''సరిహద్దుల్లో కాపలా కాస్తుంటే, శత్రు దేశం వాళ్ళు మీమీద ఎటాక్ చేసిన సందర్భాలు ఏమైనా ఉన్నాయా?''

''ఓహ్...ఓసారేమైందంటే....'' అంటూ ఉత్సాహంగా ఓ అయిదు నిమిషాలు చెప్పుకుంటూ పోయాడు...ఆ తర్వాత అనుమానంతో కాంతామణి వైపు చూస్తే...కాంతామణి అతను చెప్పేది గబగబ షార్ట్‌హ్యాండ్ లెవల్లో రాసుకుంటూ పోతోంది.

''ఏం చేస్తున్నారు?'' అయోమయంగా అడిగాడు.

''మిల్ట్రీ కథలు పేరుతో ఓ పత్రిక్కి మీరు చెప్పిన కథ పంపిస్తాను. అన్నట్టు నా పేరు కాంతామణి. రచయిత్రిని...అఫ్‌కోర్స్ యింకా నా కథలు పత్రికల్లో పడలేదు, రేపో, మాపో పడతాయి...'' అంది ఉత్సాహంగా.

''అలాగా...'' అన్నాడు బిక్కచచ్చి. అప్పటికి ఎలాగో అక్కడ్నుంచి తప్పుకున్నాడు.

★★★

''ఎంత పనైసాడ్రా...'' నెత్తికొట్టుకుంటూ అన్నాడు కిషోర్ బలేశ్వర్రావ్‌తో.

''అదేంట్రా...నేనేం చేసాను...'' అయోమయంగా అడిగేడు.

''ఏం చేసాను...అని తిన్నగా అడుగుతున్నావా? నిన్నసలు ఆ కాంతామణి జోలికి ఎవరెళ్ళమన్నారు?''

''దిసీజ్ ట్రీమచ్...నువ్వు నా క్యారెక్టర్‌ని శంకిస్తున్నావ్?'' ఉక్రోషంగా అన్నాడు బలేశ్వర్రావ్.

''నా ఉద్దేశం అదికాదు. ఆవిడ కనిపించగానే దొడ్డిదారిన రావలసింది''

''నేను మిలట్రీ మనిషిని...నాకేం భయం...ఒంటి చేత్తో పదిమందిని ఎదుర్కోగలను'' అన్నాడు బలేశ్వర్రావ్.

''నీ ఖర్మ...నీకింకా కాంతామణి గురించి పూర్తిగా తెలిసినట్టు లేదు'' అన్నాడు.

''ఏంటో...వీడో పిచ్చిమాలోకం...'' అనుకున్నాడు బలేశ్వర్రావ్ కిషోర్ వంక చూసి.

''ఏంటో...వీడో వెర్రిమాలోకం'' అనుకున్నాడు కిషోర్ బలేశ్వర్రావ్ వంక చూసి.

తథాస్తు దేవతలు ''ఎగ్జాక్ట్‌లీ'' అనుకున్నారు.

ఎం. రజని

★★★

''అయితే...అప్పుడేమైంది'' మరింత ఆసక్తిగా అడిగింది కాంతామణి.

బలేశ్వర్రావ్‌కు ఓ పక్క నిద్ర ముంచుకొస్తోంది. మరో పక్క కోపం తన్నుకొస్తోంది. టైం అర్ధరాత్రి పన్నెండున్నర అయింది.

సాయంత్రం నాలుగ్గంటలకు వచ్చింది మిలట్రీలో తన వీరవిక్రమ పరాక్రమ గాథలు చెప్పమంటే, రెచ్చిపోయి, మెదడు ఆ క్షణంలో పన్జేయక పుచ్చిపోయి, శాంపిల్‌గా నాలుగైదు కథలు చెప్పాడు. అతను చెప్పడం...కాంతామణి రాసుకుంటూ వుండడం...మళ్లీ అతను చెప్పడం ...కాంతామణి రాసుకుంటూ వుండడం...చెప్పి...చెప్పి...బలేశ్వర్రావ్ నోరు పిడచకట్టుకుపోయింది. శరీరం నీరసించిపోయింది. ఓపిక చచ్చిపోయింది.

కానీ కాంతామణి ఉత్సాహంగా. ''ఆ తర్వాత...ఆ తర్వాత'' అంటోంది.

బలేశ్వర్రావ్ సహనం నశించింది. అయినా సహించి, ''అమ్మా...తల్లీ కాంతామణీ...నన్ను కరుణించు...మిగతాది రేపుకోడి కూయక ముందే చెబుతాను. ఒట్టు...'' అన్నాడు ఆవులిస్తూ ఏడుపుగొంతుతో.

అదే అతను చేసిన పొరపాటు.

ఎగ్జాక్ట్‌లీ...కోడి కూయకముందే వచ్చి బలేశ్వర్రావ్ మొహం మీద ఉన్న దుప్పటి ముసుగు తీసి, ''చెప్పండి...ఆ తర్వాతేమయింది?'' అని అడిగింది.

కిషోరు ఊరి వాళ్ళు ఈ నాలుగు రోజులుగా తన వంక ఎందుకు జాలిగా చూసేవారో, కాంతామణి వస్తుంటే, కిడ్నాపర్లు వస్తున్నట్టు ఎందుకు వీధి జనం పారిపోయేవారో అప్పుడర్థమైంది. ఆ నాలుగు రోజుల్లో బలేశ్వర్రావ్ నాలుగున్నర కేజీలు తగ్గాడు.

బలేశ్వర్రావ్ అన్నం తింటున్నా, మార్నింగ్ వాక్ చేస్తున్నా, పడుకోబోతున్నా, కథలు చెప్పమనేది కాంతామణి.

భరించలేకపోయేడు...తల దిండు కింద ఉన్న రివాల్వర్ తీసి ''భారత్‌మాతాకీ జై...'' అంటూ కసిగా ఆకాశంకేసి గురిచూసి ధన ధనమని ట్రిగ్గర్ నొక్కాడు.

రివాల్వర్‌లోని గుండ్లు ఎక్కడెక్కడ చెల్లాచెదురు అయ్యాయో తెలియదు కానీ, ఆ శబ్దానికి, ఆ అరుపునకు కాంతామణికి ఉన్న ఒకే ఒక గుండె ఠపీమని ఆగిపోయింది.

కాంతామణి చచ్చిపోయింది.

★★★

''హలో...బ్రదర్స్...మీరెవరూ? తెలుగు సినిమాల్లో యమకింకరులకు మల్లె ఉన్నారు?'' అడిగింది కాంతామణి, కోరలతో నల్లటి శరీరాలతో ఉన్న యమభటులను చూసి.

''మేం అసలు సిసలైన యమభటులం'' అన్నారు యమభటులు.

''అంటే నేను చచ్చిపోయానా?''

''అవును''

''మరి నన్ను నరకానికి ఎందుకు తీసుకెళ్తున్నారు? నేనేం పాపం చేశాను?''

''కనిపించిన ప్రతీవారినీ కథలు చెప్పమని వేధించావు. నీకు కథలు చెప్పలేక, కొందరు పిచ్చెక్కిపోయారు. మరికొందరు నిన్ను తప్పించుకు తిరిగే ప్రయత్నంలో ఘోరమైన యిక్కట్లు పడ్డారు. చివరికి నీ భర్త రోజూ ఆఫీసు ఉంచి కరెక్ట్‌గా వచ్చేవాడు. నువ్వు అతడ్ని ఆలస్యంగా రమ్మని, అలా వచ్చాక ఏదైనా ఓ కథ 'ఆలస్యంగా' వచ్చినందుకు చెప్పమని వేధించావు...ఆ పాపాలన్నీ పెరిగిపోయాయి'' యమభటులు ఎక్స్‌ప్లెయిన్ చేసేరు.

'' నా నరకం వెనక యింత కథ ఉందన్న మాట. అయితే ఓ చిన్నమాట. నాలాంటి పాపాత్ముల కథలు మీకు బోల్డు తెలుసుంటాయ్ కదా...అవి చెప్పరూ...ప్లీజ్...ఆ కథలన్నీ 'యమభటుల కథలు' పేరుతో పత్రిక్కి పంపించి, మీకే అంకితమిస్తా...'' అంది.

ఇంకా నరకానికి వెళ్లకుండానే, యమభటులు పిచ్చెక్కి కాంతామణికి కథలు చెప్పలేక, ఏదైతే అది అయ్యిందని, ఆమెని స్వర్గంలో డ్రాప్ చేసి చేతులు దులుపుకున్నారు.

★★★

స్వర్గం అల్లకల్లోలమైంది.

ఇంద్రుడు సభ ప్రారంభించి, నృత్యం చేయడానికి రంభ, ఊర్వశి, మేనకలను పిలిచాడు. వాళ్ల జాడలేదు. తీరా ఆరాతీస్తే ఓ చెట్టుకింద వాళ్ల ముగ్గుర్నీ (రంభ, ఊర్వశి, మేనకలను) కూచోపెట్టి, వాళ్లని కథలు చెప్పమని అడుగుతూ కనిపించింది కాంతామణి.

మరో రోజు సప్తమహర్షులను కలిసి వాళ్ల కథలు చెప్పమంది. యింకో రోజు ఇంద్రుడి భార్య దగ్గరికి వెళ్లింది. ఇంద్రుడికి ఓపిక నశించి, దివ్యదృష్టితో విషయం గ్రహించి, తమ లోకానికి కాంతామణి వల్ల ముప్పు తప్పదని గ్రహించి, తన శక్తితో మరికొంత ఆయుష్షు పోసి భూలోకానికి పంపించాడు.

★★★

''కాంతామణి మొగుడా...ఇన్నాళ్లూ నీ పేరు మరిచిపోయి కాంతామణి మొగుడు అని పిలిచాము..ఇక నుంచైనా హాయిగా వుండు...'' అని ఓదార్చారు.

బలేశ్వర్రావ్ పిచ్చిపిచ్చి చూపులు చూస్తూ కాంతామణి శవం వైపే చూస్తున్నాడు.

సరిగ్గా అప్పుడు జరిగిందా అద్భుతం.

కాంతామణి శవం కదుల్తోంది. మెల్లిగా కళ్లు తెరిచింది.

కాంతామణి మొగుడు బిక్కచచ్చిపోయేడు.

బలేశ్వర్రావ్‌కు చచ్చినంత పనయింది.

వీధి జనం రన్నింగ్‌రేస్‌లో పరుగెత్తినట్టు పరుగెత్తడానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్లకి కాంతామణి దయ్యమై వచ్చిందన్న భయంకన్నా, మళ్లీ 'తమని కథలు చెప్పమని' వేధించుకు తింటుందన్న భయమే ఎక్కువ.

అప్పుడు గొంతు విప్పి...

''ఆగండి...నేనిప్పుడు స్వర్గానికి వెళ్లొచ్చిన కాంతామణిని. పాపపుణ్యాలు తెలిసిన మనిషిని. శరీరాన్ని గాయపర్చడమే కాదు, మనసును బెదరగొట్టడం కూడా తప్పేనని తెలిసింది. ఇక నుంచి మిమ్మల్ని కథలు చెప్పమని వేధించను. ఈ ప్రపంచాన్ని నిశితంగా పరిశీలిస్తాను. నా చుట్టూ ఉండే ఎన్నో పరిస్థితులు, మనుష్యుల మనస్తత్వాలే నా కథావస్తువులు. ఇవ్వాల్టి నుంచి నా బాధ ఉండదు'' అంది కాంతామణి.

వీధి జనం ఊపిరి పీల్చుకున్నారు.

బలేశ్వర్రావ్ ఆనందభాష్పాలు రాల్చేడు.

కాంతామణి మొగుడు హాయిగా నిట్టూర్చాడు.

స్వర్గానికి వెళ్లొచ్చిన కాంతామణి ఇప్పుడు ఎవర్నీ సతాయించకుండానే, రచయిత్రిగా తెగకథలు రాసి పేరు తెచ్చుకుంటోంది. ★

